క్లుప్తంగా

వైభవంగా పోలేరమ్మ కొలుపు



సత్యవేడు: మండలంలోని పెద్ద ఈటిపాకం పంచాయతీలో మూడు రోజుల పాటు నిర్వహించిన పోలేరమ్మ కొలుపు గురువారంతో ముగిసింది. మంగళవారం నడివీధి గంగమ్మ గుడి వద్ద పోలేరమ్మకు అంబళ్లు పోసి మొక్కులు చెల్లించారు. సాయంత్రం గెరిక ఊరేగింపు, అమ్మవారి రూపుతో ముగ్గు వేశారు. బుధవారం రాత్రి పోలేరమ్మ రూపంలో అమ్మవారిని అలంకరించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. నడివీధి పర్ణశాలలో అమ్మవారిని కొలువుదీర్చారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతోపాటు శ్రీసిటీ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు, మాజీ ఎంపీపీ వి. మస్తాన్, వీకేఎన్ బాషా, ప్రవీణ్‌కుమార్, మోహన్ బాబు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బడిలోకి విద్యార్థులు



విద్యార్థికి అడ్మిషన్ అందజేస్తున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: నీర్పాకోట, కనమనంబేడు గిరిజన కాలనీల్లో నేను బడికి పోతా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కాలనీల నుంచి బడి మానేసిన ఇద్దరు పిల్లలను బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ మునిసుబ్రమణ్యం చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం బడి ఈడు పిల్లలంతా బడిలో ఉండాలని తెలిపారు. బడి మానేసిన పిల్లలను తిరిగి చేర్పించేలా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులు మీర్జానబీ, కళ్యాణ్, సీఆర్‌పీ ప్రసూన, తదిరులు పాల్గొన్నారు.

వసతి గృహాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

శ్రీకాళహస్తి: వసతి గృహాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. తిరుపతి జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం వసతి గృహాల అధికారులు ఊరందూరులో ఎమ్మెల్యేను కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీకాళహస్తిలో వసతి గృహాల నిర్వహణపై విమర్శలొస్తున్నాయని, పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద ఉన్న సమీకృత వసతి గృహంలో మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ఒక పరిశ్రమ నిర్వాహకులతో మాట్లాడానని, సీఎస్ఆర్ నిధులతో వారు వసతులు కల్పించడానికి ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలను కూడా సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. వసతి గృహాల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు పోవాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్లు రామయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటు ధరల్లో నిత్యావసర సరుకులు

శ్రీకాళహస్తి: సామాన్యులకు అందుబాటులో నిత్యావసర సరుకులను అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అయ్యప్ప జనరల్ స్టోర్‌లో గురువారం ఆయన ప్రభుత్వం నిర్ణయించిన విధంగా కంది పప్పు రూ.160, స్టీమ్ బియ్యం రూ.49లకే ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సత్యవేడులో..

సత్యవేడు: రైతు బజార్లు, మాల్స్, సూపర్ మార్కెట్‌లలో బియ్యం, కందిపప్పును నిర్దేశించిన ధరలతోనే విక్రయించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. గురువారం సత్యవేడులో తహసీల్దార్ రామాంజనేయులుతో కలసి బీబీఎస్ లాడ్జి సమీపంలో బియ్యం విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. డీఈ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటారు ఏర్పాటు



ఏర్పేడు: మండలంలోని మేర్లపాకలో సర్పంచ్ గంగాధరం ఆధ్వర్యంలో గురువారం నూతన తాగునీటి విద్యుత్ మోటారు ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితం తాగునీటి మోటారు మరమ్మతులకు గురైంది. గ్రామస్తులు సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడంతో పాత మోటారు స్థానంలో కొత్త మోటారు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు సీపీ రమణ, చింతయ్య, మునిసుబ్బులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని గురువారం ఎంపీ గొల్ల బాబురావు, కేంద్ర మంత్రి బేచారం మన్న, తెలంగాణ ఎమ్మెల్సీ కాలేరు వెంకటేష్, మాజీ క్రికెటర్ శ్రీశాంత్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు.

తల్లికి వందనం.. ఒక్కరికేనా?

- ఎదురు చూస్తున్న తల్లులు
- పాఠశాలలు ప్రారంభమైనా పట్టించుకోని ప్రభుత్వం
- బడికి వెళ్లే ఎంతమంది పిల్లలకైనా తల్లికి వందనం వర్తించేనా?
- అనుమానాలు వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



వరదయ్యపాళెం: ఎన్నికల ముందు ఓట్ల కోసం కూటమి నేతలు సూపర్‌సిక్స్ వాగ్దానాలతో ఊదరగొట్టే ప్రసంగాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నమ్మి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెప్పించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబునాయుడు మాత్రం వాగ్దానాల కోతలకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఆ దిశగా తల్లికి వందనం పథకం అమలుకు తాజాగా విడుదల చేసిన జీఓ పలు అనుమానాలకు దారి తీస్తోంది. ఆధార్‌కార్డ్ ఆధారంగా కుటుంబంలో ఒకరికి మాత్రమే పథకం వర్తిస్తుందని జీఓలో సూచించడంతో ఒక్కసారిగా లబ్ధిదారులు బౌరా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలి



కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తూచా తప్పకుండా నెరవేర్చాలి. నాకు ఉన్న ఇద్దరు పిల్లలు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. వారిద్దరికీ తల్లికి వందనం పథకం ద్వారా రూ.30వేలు వస్తుందని ఆశపడుతున్నాం. అయితే పాఠశాలలు తెరిచి నెలరోజులు పూర్తి కావస్తున్నా ఇప్పటివరకు ఆ పథకాన్ని అమలు చేయలేదు. ఇప్పుడు ఆ పథకానికి అర్హత సాధించాలంటే అనేక ఆంక్షలు విధిస్తున్నట్లు చెబుతున్నారు. ఇలాంటి తరుణంలో నాలాంటి గిరిజనులకు కార్యాలయాల చుట్టూ తిరిగే అవగాహన లేదు. పేద ప్రజల పిల్లల చదువుకు ఇలాంటి పథకాలు ఎంతో అండగా నిలుస్తాయి. అలాంటి వాటిపై నిర్లక్ష్యం చూపడం సరికాదు.

– బుజ్జమ్మ, వరదయ్యపాళెం

ఇద్దరి పిల్లలకు 30 వేలు ఇవ్వాలి



ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు నిబద్ధతతో నెరవేర్చాలి తల్లికి వందనం అందరి పిల్లలకు వర్తింపజేయాలి. నాకు ఉన్న ఇద్దరి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. వారికి కూటమి నేతలు ఇచ్చిన వాగ్దానం మేరకు ఒక్కో బిడ్డకు రూ.15 వేలు చొప్పున మొత్తం రూ.30 వేలు ఇవ్వాలి. విద్యా సంవత్సరం ప్రారంభంలో ఈ పథకాన్ని పంపిణీ చేస్తే మాలాంటి నిరుపేదల పిల్లల చదువుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. విద్యాసామగ్రి, దుస్తులు కొనుగోలు చేసేందుకు గతంలో ఇస్తున్న అమ్మఒడి ఎంతగానో ఉపయోగపడేది. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆంక్షలు లేకుండా 'తల్లికి వందనం' అమలు చేయాలి.

– జయశ్రీ, నాగలాపురం

ట్రిపుల్ ఐటీకి ఐదుగురు ఎంపిక



సోమశేఖర్



నవ్య దేవాంగ



జనని



వెంకటమ్మ



లోకేశ్వరి

నాగలాపురం: పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న పి.సోమశేఖర్ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్ తెలిపారు. సోమశేఖర్ ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులతో మండలంలోనే మొదటి స్థానం సాధించడం గమనార్హం. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైన సోమశేఖర్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

బుచ్చినాయుడుకండ్రిగ: కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని నవ్య దేవాంగ 578 మార్కులతో ప్రథమ స్థానంలో పాసైంది. ఈ విద్యార్థిని ఇడుపులపాయ క్యాంపస్‌లోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రూపేష్ కుమార్ తెలిపారు. గురువారం విడుదలైన ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో నవ్య దేవాంగ ఎంపికైంది. ఆరు సంవత్సరాల ట్రిపుల్ ఐటీ కోర్సులో ప్రవేశానికి పాఠశాల నుంచి ఎంపిక కావడంతో ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు నిర్మల్‌కుమార్ గురువారం తెలిపారు. 10వ తరగతి చదివిన జనని(నూజివీడు), వెంకటమ్మ, లోకేశ్వరి (కడప) ట్రిపుల్ ఐటీకు ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకుని బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినులు మరింత ప్రతిభ చాటి స్కూలుకు, గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు తేవాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, గుణశేఖర్‌రెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి, కుమార్ రాజు, ఉమామహేశ్వర్, సురేష్‌బాబు, రామచంద్రయ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కేవీబీపురం(వరదయ్యపాళెం): ప్రమాదం జరిగితే గానీ విద్యుత్ అధికారులు స్పందించరా అంటూ కేవీబీపురం మండలంలోని పెరిందేశం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే గేటుకు సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అయితే ట్రాన్స్‌ఫార్మర్ చేతికందే ఎత్తులో ఉండడంతో ప్రమాదకరంగా మారింది. పిల్లలు ఆటలాడుకుంటూ అటువైపు వెళ్లితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించి, సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటుకు మార్పు చేయాలని విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నా రు. ట్రాన్స్‌ఫార్మర్ మార్పుకు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీసర్వమంగళ సమేత శ్రీపళ్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం శ్రీవారాహి అమ్మవారికి ఆషాఢ నవరాత్రుల సందర్భంగా విశేష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆరో రోజు శ్రీ వారాహి అమ్మవారికి పంచామృతంతో విశేష అబిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రారెడ్డి పూజలో పాల్గొన్న భక్తులకు దర్శన ఏర్పాట్లు చేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు కార్తికేశన్, సతీష్ శర్మ, గణేష్ శర్మ, ఆలయ సిబ్బంది శరవణ, పరంధామరెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న తిరుపతి రూరల్ సీఐ తమీమ్ అహ్మద్

తిరుపతి రూరల్: సీఐ తమీమ్ అహ్మద్ ఆధ్వర్యంలో గురువారం పంచాయతీల్లో ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. మత్తుపదార్థలు ఏమైనా ఉన్నాయా...అంటూ ఆటోలు, ప్రయాణికుల వాహనాలను క్షుణ్ణంగా పరిక్షించారు. లైసెన్స్ లేనివారు, త్రిబుల్ రైడింగ్ చేస్తున్న ద్విచక్ర వాహనదారులకు, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్న వారికి మొదటిసారి కౌన్సెలింగ్ ఇచ్చారు. మితిమీరిన వేగంతో పో తున్న బైక్ రైడర్స్‌కు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ తమీమ్ అహ్మద్ మాట్లాడుతూ మత్తు పదార్థ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అందులో భాగంగానే వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నా రు. ద్విచక్ర వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, లేకుంటే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. తిరుపతి రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు బాలకృష్ణ

రేణిగుంట: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు టి.బాలకృష్ణ అన్నారు. మండలంలోని ఆర్.అగ్రహారం, గుండాకాల్వ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించారు. డ్రాపౌట్స్ లేకుండా బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలనిన్నారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ వి.మధు, ఎంఈఓలు ఇందిరాదేవి, రంగనాథ్ పాల్గొన్నారు.

వైభవంగా పరాశరేశ్వర స్వామి రథోత్సవం



ఊరేగింపులో పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీకి అనుబంధంగా ఉన్న చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో గురువారం సాయంత్రం రథోత్సవంలో ఉత్సవర్లు భక్తుల నుండి హారతులు అందుకున్నారు. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలు, పరివార దేవతలకు అభిషేకాలు, నైవేద్య సమర్పణ చేశారు. 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వర స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించి దూప, దీప, నైవేద్యాలను సమర్పించి, భక్తులకు వితరణ చేశారు. ఆలయంలో చెక్క రథం లేకపోవడంతో సర్వభూపాల వాహనాన్ని సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం కైంకర్యాలను అందుకున్న ఉత్సవర్లు రథాన్ని తలపించే సర్వభూపాల వాహనాన్ని అధిరోహించారు. పరాశరేశ్వరస్వామి గ్రామోత్సవంలో భక్తుల నుండి హారతులు అందుకున్నారు. పైకార్యక్రమాలను స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ పర్యవేక్షించారు. ఉత్సవాల్లో శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో చంపకవల్లీ, పరాశరేశ్వరస్వామికి జరిగే ఆర్జిత కల్యాణోత్సవం అనంతరం అశ్వ వాహనాన్ని అధిరోహించి స్వామివారు గ్రామోత్సవంలో పాల్గొంటారు. ఆర్జిత కల్యాణోత్సవంలో రూ.500 చెల్లించి దంపతులు పాల్గొనవచ్చునని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు.

కుక్కంబాకంలో పారిశుధ్య పనులు



మురుగునీటి నిల్వలు పరిశీలిస్తున్న డీపీఓ సుశీలాదేవి



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీపీఓ సుశీలాదేవి

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ: వర్షాకాలం మొదలవుతుండటంతో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి సుశీలాదేవి తెలిపారు. గురువారం సాక్షి దినపత్రికలో 'ఎడ కేసిన పారిశుధ్యం' అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో ఆమె కుక్కంబాకం గ్రామంలో పర్యటించారు. గ్రామంలో అధ్వానంగా ఉన్న పారిశుధ్యంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జేసీబీ యంత్రాన్ని రప్పించి గ్రామంలోని మురుగు నీటి నిల్వలను తొలగించారు. మురుగునీటి కాలువలను వెంటనే శుభ్రం చేయించి, వీధులలో బ్లీచింగ్ చేయించాలని ఆదేశించారు. తాగునీటి ఓవర్ హెడ్‌ట్యాంకును శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయాలని తెలిపారు. వారం రోజులపాటు అధికారులు గ్రామంలోనే ఉండి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా అతిసార, జ్వరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి రోజూ గ్రామ కార్యదర్శి గ్రామంలో పర్యటిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ రవీంద్రబాబు, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, వైద్యాధికారి దివాకర్, సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు, ఈఓపీఆర్‌డీ రాజశేఖర్, సర్పంచ్ ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భద్రతపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి గురువారం ఇంటెలిజెన్స్ డీఎస్పీ విశ్వనాథ్ విచ్చేశారు. ఈఓ ఎస్ వీఎస్ఎన్ మూర్తి, శ్రీకాళహస్తి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్పీఎఫ్, ఆలయ ఇంజినీరింగ్ శాఖ అధికారులు, హోంగార్డు, సెక్యూరిటీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆలయ భద్రతపై సమీక్షించారు. అనంతరం ఆలయంలోని పలు ప్రాంతాలను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో గురువారం ఎంప్లాయీస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గౌరవాధ్యక్షులు, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి మాట్లాడారు. యూనియన్ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో పీఎస్ కుమార్, జీపీఎస్ ఆచారి, రోశయ్య, మురళి, రమేష్, ప్రసాద్, ఎంఎం రత్నం, కత్తి రవి తదితరులు పాల్గొన్నారు.

కలిక్కం సిద్ధ ఔషధ మందు పంపిణీ



ఔషధ మందును పంపిణీ చేస్తున్న లోకా ఫౌండేషన్ ప్రతినిధులు

వరదయ్యపాళెం: లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర సమస్యల కోసం ఉచితంగా పంపిణీ చేస్తున్న కలిక్కం సిద్ధ ఔషధ మందుకు విశేష స్పందన లభించింది. మండలంలోని బత్తలవల్లంలోని ఏకం ఆలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 300 మందికి ఈ ఔషధ మందును పంపిణీ చేశారు. ఏకం వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ మాట్లాడుతూ.. కలిక్కం అనేది సిద్ధ వైద్యంలో కంటి వైద్యమని తెలిపారు. సిద్ధులు సాంప్రదాయబద్ధంగా ఉపయోగించే కొన్ని అరుదైన మూలికల సారం కళ్లలోకి పోయడంతో కంటి చూపు వృద్ధి చెందుతుందన్నారు. పలు చర్మ వ్యాధులు నయమవుతాయని ఆయన పేర్కొన్నారు. క్యాంప్ డైరెక్టర్ సతీష్, వైద్యులు ముత్తుకృష్ణన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి పురస్కారం



రాజేంద్రకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న సినీనటుడు సుమన్

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రాజేంద్ర గౌరవ డాక్టరేట్‌తో ప్రతిభా అవార్డు అందుకున్నారు. బడిమానేసిన విద్యార్థులను బడిలో చేర్పించడం, విద్యార్థులతో మొక్కలు నాటించడం, విజ్ఞాన, విహార యాత్రలో విద్యార్థులను పాల్గొనేలా చేయడం, విద్యార్థుల జీవన నైపుణ్యాలు పెంపొందించడం, మంచి సమీకరణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు కల్పించడంపై హైదరాబాద్‌కు చెందిన మనం ఫౌండేషన్ ప్రతినిధులు ఆయనకు గౌరవ డాక్టరేట్‌తో పాటు పద్మ ప్రతిభా అవార్డును ప్రముఖ సినీనటుడు సుమన్ చేతుల మీదుగా అందజేసి సన్మానించారు. జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని ఇచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజం కళామందిర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

సినీనటుడు మోహన్‌బాబుకు ఆహ్వానం



విరాళ చెక్కును అందజేస్తున్న సినీనటుడు మోహన్‌బాబు

ఏర్పేడు: మండలంలోని మోదుగులపాలెంలో నిర్వహించనున్న పీర్ల పండుగకు హాజరు కావాలని సినీనటుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు మంచు మోహన్‌బాబును గ్రామస్తులు ఆహ్వానించారు. గురువారం ఆయనను పలువురు గ్రామస్తులు రంగంపేటలోని విద్యాసంస్థలలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. పీర్ల ఉత్సవానికి మోహన్‌బాబు విరాళమిచ్చారు. కార్యక్రమంలో దయాకర్ మొదలి, శివకుమార్, మస్తాన్ నాయుడు, చంద్రశేఖర్ చౌదరి, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధర్మరాజస్వామి ఉత్సవాలు



ధర్మరాజస్వామి ఆలయం వద్ద స్వాగత తోరణం

స్థానిక చెన్నైరోడ్డులోని శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయం శుక్రవారం నుంచి ఉత్సవాలకు ముస్తాబైంది. 12వ తేదీ నుంచి 24వ వరకు ఈ ఉత్సవాలనను సాంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నారు. ఆలయ పరిసరాలను సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలంకరణతో సరికొత్త సొబగులు దిద్దారు. -శ్రీకాళహస్తి



ఆలయ ధ్వజస్తంభం



ఆలయం ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండం